# పంచభూతములు పరమాత్మ స్వరూపములే!

కొలదికొలదిగ పుట్టును తొలుత చెదలు
కొరికి తినివేయు త్వరలోన కొయ్యనంత
దుష్టగుణములు సూక్ష్మమై తోచు మొదలు
పిదప నాశంబు చేయు నే పెద్దనైన.

పొగకు మూలము నిప్పుల పుంజముండ
రైలుబండిని నడిపించు డ్రైవరుండ
ఆటొమేటిక్కు లైటుకు అధిపుడుండ
ఒకడు జగతిని సృష్టింప నుండవలదె?

విద్యార్థులారా!

దృశ్య గోచరమయ్యే ఈ చరాచర రూపమంతయు పంచభూతములతో కూడినది. పంచభూతముల ప్రకాశమే ఈ ప్రపంచము. దీనికే దృశ్యమని మరొక పేరు. యిది విశ్వము. అనగా అనేక రూపములతో అనేక అంగములతో, అనేక భావములతో ఈ జగత్తునందు భగవంతుడే అనేక స్వరూపములను ధరిస్తున్నాడు. దీనినే పురుష సూక్తమందు 'సహస్రశీర్షాపురుషః సహస్రాక్ష సహస్రపాత్'. అని వర్ణించడం జరిగింది. సహస్రనేత్రములతో, సహస్ర శిరస్సులతో, సహస్రపాదములతో, సహస్ర హస్తములతో, సహస్ర పరికరములతో ప్రభవించినదే, యీ ప్రపంచము.

### కార్యకారణ సంబంధమే ఈ జగత్తు

విశ్వము, కార్యము. విష్ణువు, కారణము. కార్యకారణసంబంధమే ఈ జగత్తు. కార్యమునందు గొప్పస్వరూపమును ధరించి ఉంటాడు, భగవంతుడు. కారణమునందు చాలా సూక్ష్మస్వరూపమును ధరించి ఉంటాడు. కానీ, ఈ కార్యకారణములు రెండూ

sri sathyasai vachanamrutam

దైవస్వరూపమే!

**సూక్ష్మమైనట్టి అణువున సూక్ష్మ మగుచు**
**మేటి వస్తువునందు సదా మేటి యగుచు**
**అంతటను సర్వసాక్షియై యలరునట్టి**
**ఆత్మయే బ్రహ్మ, బ్రహ్మమే ఆత్మయగును**

సూక్ష్మమునందు సూక్ష్మస్వరూపము ధరిస్తుంటాడు. ఘనమునందు ఘనస్వరూపుడై ఉంటాడు. ఈ సూక్ష్మఘనములకు ఆకారమునందు భేదములేగానీ అనంతమైన శక్తియందు ఏకత్వమే! ఈ అణుఘనములు రెండూ అవినాభావ సంబంధములు, అన్యోన్య ఆశ్రయములు. కనుక, ప్రకృతిని మనము వేరుగా తలచరాదు. ప్రకృతియే పరమాత్మ, పరమాత్మయే ప్రకృతి. ఈ ప్రకృతియందున్న పంచభూతములు పరమేశ్వరుని స్వరూపములే! ఈ భూమిని 'భూదేవత' అని పిలుస్తూ వచ్చారు. భూమికూడా దేవతయే! తరువాత జలమును 'గంగా దేవత' అంటున్నారు. జలమునుకూడా దైవముగనే భావిస్తున్నారు. గాలిని 'వరుణదేవుడ'ంటున్నారు. అగ్నిని 'అగ్నిదేవుడ'ంటున్నారు. ఆకాశమును 'శబ్దబ్రహ్మమ'ంటున్నారు. ఈ పంచభూతములు భగవత్స్వరూపములే! ఇట్టి పంచభూతములను మనము అలక్ష్యముగా భావించి వీటిని పెడమార్గములో దుర్వినియోగపరచుకుంటున్నాము. ఈ విధముగా దుర్వినియోగపరచినప్పుడు దైవమునే దుర్వినియోగపరచినట్లవుతుంది. కనుక, పంచభూతములను సక్రమమైన మార్గములో, పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టి దానిద్వారా మనముకూడా పవిత్రులు కావాలి.

**భూత భవిష్యద్వర్తమానములకు అధిపతి భగవంతుడే!**

భగవంతునకు మరొకపేరుకూడా కలదు. పుట్టుటకు పూర్వమున్న పదార్థములుగానీ, ప్రస్తుతములో ఉండిన పదార్థముగానీ, భవిష్యత్తులో కలగబోయే పదార్థములుగానీ పుట్టించి, పోషించి, అంత్యము గావించేవాడు భగవంతుడే! ఈ మూడింటికి అధిపతియైన ప్రభువు తానే! భూతము, వర్తమానము, భవిష్యత్తు యీ మూడింటికి అధిపతి తానే! కనుకనే ఆంధ్రులు నూతన సంవత్సరమును ప్రారంభించినప్పుడు 'ప్రభవ' అంటారు. అనగా

sri sathyasai vachanamrutam

అన్నింటికి ప్రభువు తానే! ప్రభువును మొట్టమొదట విశ్వసించాలి. ప్రభువును విశ్వసించినప్పుడే ప్రకృతిని మనము చక్కగా శాంతిగా అనుభవించుటకు వీలవుతుంది. విద్యార్థులకు కొత్తకాదు, అనేక పర్యాయములు చెప్పాను. ఈ జగత్తునందు మంచిచెడ్డలమధ్య నిరంతరము ఘర్షణ జరుగుతూనే ఉంటుంది. ధర్మాధర్మములమధ్య ఘర్షణ జరుగుతూనే ఉంటుంది. ఇది తప్పునదికాదు. ఒకవైపున కౌరవులు, మరొకవైపున పాండవులు. ఒకటి ధర్మము, రెండవది అధర్మము. ఈ రెండింటికి నిరంతరము ఘర్షణ జరుగుతూనే ఉంటుంది. కానీ యిరువురి యందున్న మనోభావములు ప్రత్యేకంగా ఉంటున్నాయి. కౌరవులు మొట్టమొదట మేము రాజులము, కనుక 'I' అని విశ్వసించారు. Next World అన్నారు. GOD last అన్నారు. ఇది కౌరవుల సాంప్రదాయము, పాండవులది అదికాదు. పాండవులది 1st GOD, next World, last 'I'. కనుకనే పరమభక్తులైనవారు, బ్రహ్మమూర్తులైనవారికి 1st GOD. మొట్టమొదటి స్థానములో భగవంతుని ఉంచుకుంటారు. అందుకోసమే భారతీయ సంస్కృతియందు, సాంప్రదాయమందు మొట్టమొదటి సంవత్సరము ప్రభవ. తరువాత విభవ. ఈ విధంగా భగవంతుని నామములే చెప్పుకుంటూవచ్చారు. ఇతను ఎట్టి దానికి సంబంధించినవాడుకాదు. కనుక అతనికి మరొక పేరు పెట్టారు ఋషులు. 'అప్రమేయ' అన్నారు. అప్రమేయ అనగా ఏమిటి? ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏ ప్రమాణములకు ఏమాత్రము చిక్కనటువంటివాడు. ప్రమాణములు మూడు రకములు. ప్రత్యక్షప్రమాణము, అనుమానప్రమాణము, పరోక్షప్రమాణము. ఎట్టి ప్రమాణములకు చిక్కనివాడు భగవంతుడు.

**అందరియందున్న ఆత్మ ఒక్కటే**

భగవంతుని యిట్టివాడు, అట్టివాడు అని నిర్ణయించుటకు సాధ్యముకాదు. ఇతను భగవంతుడు, యితను కాదు అని ఎవరు చెబుతారో వాడు మూర్ఖుడు. కారణం ఏమిటి? 'మమాత్మ సర్వ భూతాంతరాత్మ'. అందరియందున్న ఆత్మ ఒక్కటే! అన్ని బల్బులయందుండిన కరెంటు ఒక్కటే! అన్ని తీపులందు చేరిన చక్కెర ఒక్కటే! అన్ని నగలయందు చేరిన బంగారం ఒక్కటే!

sri sathyasai vahini

శృంగారములు వేరు, బంగారమొక్కటే
పశుల వన్నెలు వేరు, పాలు ఒక్కటే
జీవ జాతులు వేరు, జీవుండు ఒక్కడే
పూలజాతులు వేరు, పూజ ఒక్కటే
దర్శనంబులు వేరు, దైవమొక్కడే
తెలియలేకను మానవుల్ దెలివితప్పి
బ్రతుకుకోసము బహుబంధబద్ధులైరి
ఇంతకంటెను వేరెద్ది ఎరుకపరతు
సాదు సద్గుణ గణ్యులౌ విద్యార్థులార.

ఏమిటి భేదము? ఇది మల్లెపూలపూజ. ఇది గులాబిపూజ. ఇది చామంతిపూజ. ఇది చంపకపూజ అని పూజ ప్రత్యేకంగా ఉందా? పూజ ఒక్కటే! పుష్పములు వేరు వేరుగా వుండవచ్చును. ఈ ప్రాకృత జీవితమునందు బ్రతికే నిమిత్తమై యిన్ని రకములైన భేదములు ఏర్పరచుకుంటూ వచ్చారు. భేదములన్నియు ప్రవృత్తి లక్షణములే! ప్రాకృత లక్షణములే! భౌతిక లక్షణములే! క్షణికమైన లక్షణములే! కాని సత్యమైన, నిత్యమైన, అమృతమయమైన లక్ష్యము ఒక్కటే, ఆత్మతత్త్వము. మానవత్వములో దైవత్వము సర్వులయందు సమంగానే ఉంటున్నాది. అయితే కొంతమందికి వారి బుద్ధియొక్క ప్రభను పురస్కరించుకొని చిన్నది, పెద్దదిగా కనిపిస్తుంది.

**విశ్వము మనయందే ఉన్నది**

మనబుద్ధి మట్టితో చేసిన అద్దము వంటిది. ఈ అద్దమునందు ఎన్నో కోట్లమైళ్లలోనున్న సూర్యచంద్ర నక్షత్రములు కనిపిస్తుంటాయి. చిన్న అద్దము చేతిలో పట్టుకొని సూర్యునివైపు తిప్పు, సూర్యుని ప్రతిబింబము అద్దములో కనిపిస్తుంది. ఆ సూర్యుని చుట్టుకొలత ఏన్నోవేల మైళ్లు. అంత పెద్ద సూర్యుడు యింత చిన్న అద్దములో కనిపిస్తున్నాడు. దీనినే దక్షిణామూర్తి 'విశ్వందర్పణ దృశ్యమాన నగరీ' అన్నాడు. మన బుద్ధి అనే చిన్న అద్దములోపలనే

srisathyasaivachanamrutam

విశ్వమంతా యిమిడి ఉంటున్నాది. విశ్వమనగా ఎక్కడో బయట ఉన్నదికాదు, మనయందే ఉంటున్నది. Reflection of the inner being. ఈ లోపలనున్న దానినే బయట నీవు చూడగలుగుతున్నావు. బయట ఏమాత్రములేదు. ఇక్కడ, అక్కడ, ఎక్కడ చూచినా ఒక్కడు మాత్రమే ఉన్నాడు. ఎక్కడైనా వెతుకు, ఒక్కటే ఆత్మ. కారణం ఏమిటి? ఈ పంచభూతములు ఒక్కటే! దానినే నిన్నటి దినము చెప్పాను.

**భావాద్వైతము, కర్మాద్వైతము, వస్తుఅద్వైతము**

అద్వైతము మూడు రకములుగా ఉంటున్నాది. భావాద్వైతము, కర్మాద్వైతము, వస్తుఅద్వైతము. అద్వైతము ఒక్కటేకదా మూడు విధములుగా ఎందుకుంటున్నాది? ఈ ప్రకృతియందు నిత్యజీవితములో అనుభవిస్తున్నాము. భావాద్వైతము ఏమిటి? ఇది బట్ట. This is not cloth, it is a bundle of threads; not threads, cotton. కాబట్టి cotton, thread, cloth మూడు ఒక్కటే! దీని వినియోగము, దీని రూపనామములు ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. ప్రత్తిలేక దారము కాలేదు. దారములేక వస్త్రముకాలేదు. కాబట్టి, ఇది వస్తువుయొక్క అద్వైతము. ఇదియే భావము. ప్రత్తి ఒక భావము, దారము ఒక భావము. వస్త్రము ఒక భావము. అయితే అన్నింటియందు ఉన్న పదార్థము ఒక్కటే! ఇది భావ అద్వైతము అన్నారు. ఇది ప్రాకృతమైన అద్వైతము. క్రియాద్వైతము ఏమిటి? ఏ కర్మలు ఆచరించినా ఏ విధమైన పనులు చేసినప్పటికిని ఎట్టి సేవలో మనము పాల్గొన్నప్పటికిని ఒక్క భావము 'సర్వకర్మ భగవత్ ప్రీత్యర్థం' అన్ని కర్మలు భగవంతునికి ప్రీతిగా చేస్తున్నాననే అర్పితభావం వచ్చినప్పుడు సర్వకర్మలు ఒక్కటే! నీవు అన్నం నైవేద్యం పెట్టావు భగవంతునికి. పెట్టక మునుపు అది అన్నము. భగవంతునికి నివేదన చేసిన తరువాత ప్రసాదము. భగవంతునికి ఫలములు పెట్టావు. పెట్టక మునుపు అవి ఫలములు. కానీ నివేదన జరిగిన తరువాత అది ప్రసాదము. చక్రపొంగలి పెట్టావు, పులిహోర పెట్టావు, యివన్నీ భగవంతునికి నైవేద్యంగా పెట్టావు. కాని, అర్పితమైన తరువాత అంతా ప్రసాదమే! భగవదర్పితమైనది అంతా క్రియాద్వైతమే! ఇక్కడ రెండు అనేది లేనేలేదు. 'ఏకం ఏవ అద్వితీయం బ్రహ్మ'. ఉన్నది ఒక్కటే ఒక్కటి. అది క్రియాద్వైతము. ఇంక మూడవది పదార్థ అద్వైతము. ఇది ఏమిటి? ఈ

sri sathyasai vachanamrutam

దేహములో, ఆ దేహములో అన్ని దేహములలో ఉన్నది పంచభూతములే! ఈ పంచభూతములు ప్రతి వ్యక్తియందు ఉన్నవే! ఇదియే పదార్థ అద్వైతము. నీ దగ్గర ఏదైనా ఒక వస్తువు లేకపోతే మరొకరి దగ్గర ఆ వస్తువును కోరవచ్చు. నీవు కోరే వస్తువు నీ దగ్గరనే ఉంది. నీవు యింకొక వస్తువునెందుకు కోరాలి? నీయందున్న పంచభూతములే ఎదుటివానియందుకూడా ఉంటున్నాయి. అదియే అద్వైతము. నాయందున్న పంచభూతములే తనయందు ఉంటున్నాయి. రెండూ ఒక్కటే కాబట్టి నాకు యింకొక వస్తువు అక్కరలేదు. యింకొక పదార్థము నాకు అక్కరలేదు. 'ఏకం యేవ అద్వితీయం; ఏకోహం బహుస్యాం'. ఒక్కటే అనేకంగా రూపొందినది. ఒకే బంగారం ఎన్నో నగలుగా తయారైపోయింది. కనుక, భగవత్తత్త్వము, పంచభూతములు సర్వులందు ఉన్నవే! యిందులో భేదమేలేదు. యిదే పదార్థాద్వైతము. ఈ మూడింటియందు మానవుడు సమర్థుడైనప్పుడే సార్థకత పొందుతాడు.

**దైవప్రీతి లేనివారికి అన్నీ తప్పుగానే ఉంటాయి**

మనస్సునందు ద్వైతమునుంచుకొని, అద్వైతములో బ్రతికినప్పుడు అశాంతే మనకు ప్రాప్తిస్తుంది. ఒక చిన్న ఉదాహరణము. ఒక శ్రీమంతుడు ఉండేవాడు. ఆ శ్రీమంతునికి ఏమి పనిలేదు. తినటం, కూర్చోటం. ఈ విధంగా తినటంచేత అజీర్ణవ్యాధి వచ్చింది. ఒక స్పెషల్ డాక్టరును తీసుకు వచ్చారు. వ్యాధి నివారణకు ఏమి మందు అన్నాడు. డాక్టరు, 'శ్రీమంతుడా! నీవు నయాపైస ఖర్చు చేయనక్కరలేదు. నీ అజీర్ణమునకు నీవే కారణం. నీ కడుపు ఎంత పడుతుంది నీకు తెలియదా? కేవలం దురాశచేత ఊరికే కూరుతున్నావు. దానివల్ల అజీర్ణము వచ్చింది. జీర్ణశక్తి తక్కువ, పదార్థము ఎక్కువ. అప్పుడే అజీర్ణ వ్యాధి వస్తుంది. దీనికి చక్కని మందు చెపుతున్నాను వినమ'న్నాడు. 'ఇంత ఉప్పుగడ్డ తీసి ఎప్పుడు నోటిలో పెట్టుకొని దాని సారాన్ని మింగుతూ ఉండమ'న్నాడు. ఎవరైనా అజీర్ణములో నున్నవారు ఈ విషయము తెలుసుకోవచ్చు. ఆ విధంగా ఉప్పు సారాన్ని మింగుతూ వచ్చాడు. కొంతకాలమునకు అజీర్ణవ్యాధి తగ్గిపోయింది. ఆ సమయమునకు అతనికి పుట్టినరోజు వచ్చింది. తన పుట్టినరోజుకి అజీర్ణవ్యాధి తగ్గింది కనుక అందరికి మిఠాయిలు



srisathyasaivachanamrutam

పంచాలనుకున్నాడు. ప్రతి మిఠాయి అంగడికి వెళ్లాడు. 'అయ్యా! మిఠాయి రుచి చూడాలి', అన్నాడు. కొంచెం నోట్లో వేసుకున్నాడు. ఉప్పుగా ఉంది, సరిలేదని ఐదారు అంగళ్లు దాటిపోయాడు. ఇతని పరిస్థితి ఆరవ అంగడివాడు చక్కగా కనిపెట్టాడు. అతని దగ్గరకు వెళ్లి 'నీ మిఠాయి ఎట్లా ఉందో చూచి కొంటాన'న్నాడు. ఆ మిఠాయి అంగడివాడు చెప్పాడు, 'ఎదురుగా కుళాయి ఉంటున్నాది. ముందు నోరు కడుక్కొని రా! అప్పుడు లడ్డు రుచి చూపిస్తాన'ని. అక్కడపోయి నోరు బాగా క్లీను చేసుకున్నాడు. నోటిలో ఉన్న ఉప్పుగడ్డను పారవేసి అప్పుడు లడ్డు రుచి చూచాడు. తీయగా ఉంది. ఈ లడ్డు బాగ ఉందన్నాడు. అప్పుడు లడ్డు అంగడివాడు చెబుతున్నాడు, 'పిచ్చివాడా! నోటిలో ఉప్పు పెట్టుకొని తీపు తింటే తీయగా ఉంటుందా, ఉప్పుగానే ఉంటుంది'. అదే విధముగా ఈనాడు నాస్తికత్వమనే రోగము బయలుదేరినవారికి చేదుగడ్డను లోపల పెట్టుకొని ఎన్ని రూపముల మిఠాయి తిన్నప్పటికిని అది చేదుగానే ఉంటుంది. దుర్గుణములు, దురాలోచనలు, దుశ్చింతలు అనేవి తనయందుంచుకొని మధురమైన, దైవప్రీతికరమైన నామములుగానీ, పదములుగానీ విన్నప్పటికిని అవి చేదుగానే ఉంటాయి. ఉప్పుగానే ఉంటాయి. ఈ తప్పు పదార్థముదా? కాదుకాదు. మనలోనున్న రోగదోషము. ఒక పెళ్లివిందుకి వెళ్ళాడు ఒక డయాబెటిక్ పేషెంటు. విందులో అందరు భోజనానికి కూర్చున్నారు. లడ్డు, జిలేబి అని పంచుకుంటూ వచ్చారు. అందులో ఐదారుమంది 'మాకు వద్దండి, వద్దండి', అన్నారు. కానీ వానికి తినాలనే ఆశనే! లోపల రోగముంటున్నాది. ఆ రోగమువలన వద్దంటున్నారుగానీ నిజంగా ఆ తీపి వద్దనటంకాదు. అదే విధముగా ఈ జగత్తునందు ఆస్తికులు, నాస్తికులు, ఆస్తికనాస్తికులు, యాస్తికులు యింతమంది ఉంటున్నారు. అందులో ఆస్తికులకు ప్రీతి కల్గినప్పుడు ఏది తీసుకున్నా తీయగానే ఉంటుంది. దైవప్రీతి లేనివారికి అన్నీ తప్పుగానే ఉంటాయి. ఏది తిన్నా అరుచిగానే ఉంటుంది.

## ప్రకృతి వాంఛలనే రోగములు ప్రవేశించినప్పుడు ఆధ్యాత్మికము దూరమైపోతుంది

ఇక్కడ ఉండినంతవరకు విద్యార్థులుగానీ, అధ్యాపకులుగానీ, మరి ఒకరుగానీ పవిత్రమైన భావములతో హృదయము నింపుకుంటారు. అన్నీ మంచిగానే కనిపిస్తాయి.

srisathyasaivachanamrutam

మధురంగానే ఉంటాయి. కానీ యిక్కడనుంచి దాటివెళ్లిన తరువాత ప్రకృతి వాతావరణములోబడి ఒక రోగము వారిలో ప్రారంభమవుతుంది. ఏమిటి? ప్రకృతి వాంఛలనే రోగములొస్తాయి. ఈ ప్రకృతి వాంఛలనే రోగములు ఎప్పుడు ప్రవేశించెనో ఆధ్యాత్మికము దూరమైపోతుంది. ఆధ్యాత్మికముపైన అన్ని రకములైన అపోహాలు పడిపోతారు. యింక ఆ రోగమునకు ఏమాత్రము నివారణ లేదు. కేన్సర్‌కు నివారణ ఉంటున్నాదిగానీ భగవత్‌ద్వేషమునకు నివారణేలేదు. చదువుతక్కువా? లేక భావముతక్కువా? రావణుడు 64 విద్యలు చదివాడు. గొప్ప తపస్సంపన్నుడు. శ్రీమంతుడు, బలవంతుడు. అన్నీ ఉంటున్నాయి. కానీ కామక్రోధములు రెండు ప్రవేశించటంచేత అన్నింటికీ తాను దాసుడైపోయాడు

**ఆశకు దాసుడైన జగమంతటికి**
**తాను దాసుడే కదా!**
**ఆశను జయించినవానికి**
**అనయంబు దాసుడు లోకంబు.**

ఆశకు దాసుడైతే లోకానికే దాసుడౌతాడు. దైవానికే దాసుడౌతే లోకమే తనకు దాసత్వము చెందుతుంది. కనుక మనము దైవమును విస్మరించకూడదు. మూడు చెప్పారు వేదాంతమందు, రత్నాలమూటలు. జగత్తును నమ్మవద్దు. దైవమును మరువవద్దు. మరణమునకు భయపడవద్దు. ఈ మూడు చాలా విశ్వాసముగా చూసుకోవాలి. ఏమిటి? లోకమును నమ్మవద్దు; ఎందుకంటే, క్షణక్షణమునకు మారిపోతున్నది. దైవమును విడువవద్దు. మరణమునకు భయపడవద్దు. భయపడితే వదలుతుందా అది? అది ఎవరియందు బంధుత్వము చూపించదు. తనకు తానుగానే ఉంటుంది. వేదాంత పరిభాషయందు ఈ మూడు చాలా ప్రధానముగా చూచుకోవాలి.

**భగవత్తత్త్వము సర్వత్ర ఉంటున్నది**

'దైవము ఎక్కడనో, ఏ ప్రదేశమునందో, ఏ స్థానమునందో ఉంటున్నాది, అక్కడే మనకు కనిపిస్తుంద'ని అనుకోటం వెఱ్ఱితనము. సర్వత్రా ఉంటున్నాది భగవత్తత్వము. అదిలేని

sri sathyasai vachanamrutam

స్థానములేదు. అదికాని రూపమేలేదు. అదికాని పదార్థమేలేదు. చేతనాచేతనములందుకూడా ఉంటున్నాది. లోకములో సైంటిస్టులు ప్రతి ఒక్కటి అణువు అంటారు. లోకమంతా అణువులయొక్క ప్రభావమే! చెక్క ఉందంటే అణుప్రభావమే! మైకు ఉందంటే అణుప్రభావమే! అంతా అణువులశక్తి చేరికయే! కాబట్టి, వారంతా దీనిని 'అణువు' అన్నారు. కానీ ఆధ్యాత్మికములో దీన్ని 'శక్తి' అన్నారు. వారంతా 'శక్తి' అన్నారు. 'ఎనర్జీ' అన్నారు. పేర్లు వ్యత్యాసముకానీ పదార్థము ఒక్కటే! ఎక్కడెక్కడ పరమాణువుంటుందో అక్కడ దైవత్వముంటున్నాది. ప్రతి పరమాణువుకు ఒక రూపముంటున్నాది. రూపములేని అణువులేదు. మన హృదయవాసియే దైవత్వము. దైవమునకు అనేక రూపములుంటున్నాయి. అనేక రూపములతో కూడినదే దైవత్వము. దేహముంది కాళ్లున్నాయి. చేతులున్నాయి. ముక్కు, కన్నులు, చెవులు, నోరు ఉన్నాయి. ఇవన్నీ చేరినదే దేహము. ఇందులో ఒక్కొక్కటి వేరుగా చేస్తే where is body? అదే రీతిగా జగత్తులో ఏది చూచినా అన్నీ భగవంతుని అంగములే! కొండలంతా శిలామయము, భూమి అంతా మృణ్మయము, వృక్షములంతా కాష్టమయము, దేహమంతా మాంసమయము. అన్నీ పంచభూతములయొక్క మయమే! అంతా పంచభూతముల ప్రభావమే. సర్వము పంచభూతములయొక్క స్వరూపమే. పంచభూతములే పరమాత్మ స్వరూపము. పరమాత్మకు ప్రత్యేకరూపములేదు.

**భగవంతుడు మానవరూపములోనే వచ్చి మానవుని రక్షించాలి**

అయితే అంధులైనవారు, అజ్ఞానులైనవారికి ఈ సత్యము నిరూపించటానికి అవతారములు దిగి వస్తుంటాయి. ఆ అవతారములుకూడా ప్రత్యేకమైన రూపములతో రావు. జగత్తునందు పుట్టిన సర్వజీవరాసులు తమ తమ కర్తవ్యము తాము నిర్వర్తిస్తున్నాయి. పశువులు, పక్షులు, క్రిమికీటకాదులు, చీమలు, దోమలు తమ తమ కర్తవ్యములను ఏమాత్రము భంగపర్చుకోకుండా కాలము గడుపుతుంటాయి. అయితే ఈనాటి మానవుడే తన కర్తవ్యము విస్మరిస్తున్నాడు. పక్షులు season, reason అనుసరిస్తుంటాయి. కాని మనిషికిమాత్రం no reason, no seaon. కనుకనే భగవంతుడు మానవాకారములోనే వచ్చి

srisathyasaivahini.org

యీ చెడిపోయిన మానవుని సంరక్షించాలి. అదే 'దైవం మానుష రూపేణ'. భగవంతుడు మనుష్యరూపంలో రావటానికి కారణం యిదే! అలాకాకుండా మనిషి దోషములను నిరూపించాలని గ్రద్దరూపములో వచ్చి చెబితే దాన్ని, రాళ్ళతో కొట్టి పంపిస్తారు. ఏమాత్రము లక్ష్యము చేయరు. దున్నపోతు వచ్చి 'నీకు బుద్ధి ఉందా లేదా' అంటే 'నీవు ఏమిటి నాకు చెప్తావు' అని కట్టెతో కొట్టి పంపిస్తాడు. ఇక్కడ రెండు రకములైన తత్త్వములను మనం భావించాలి. ఒకడు జ్ఞానదేవుడు, మరిఒకడు భక్తిదేవుడు, యిరువురు అన్నదమ్ములుంటున్నారు. యిరువురు కలసి ప్రయాణం చేస్తున్నారు. జ్ఞానదేవుడు, భక్తిదేవుడు కలిసి ప్రయాణం చేస్తుండగా వారికి దాహం వేసింది. భక్తిదేవుడు, జ్ఞానదేవుని అడిగాడు: 'జ్ఞానదేవా! దాహంగా ఉంటున్నాది, నీరు ఎక్కడా కనిపించలేదు'. జ్ఞానదేవుడు బావిలో ఎక్కడైనా ఉన్నాయేమో వెదుకుదామన్నాడు. కొంతదూరం పోయేటప్పటికి పాత బావి ఒకటి కనిపించింది. చాలా అడుగున నీరు కనిపించింది. అప్పుడు జ్ఞానదేవుడు పక్షిరూపాన్ని ధరించి లోపలకి పోయి నీరు త్రాగివచ్చాడు. జ్ఞానదేవుడు ఏ రూపమునైనా ధరించవచ్చు. ఎందుకంటే 'జ్ఞానాదేవతుకైవల్యం'. 'అద్వైతలక్షణం జ్ఞానం'. భక్తిదేవుడు లోపలికి పోలేదు. అతనికి ఆ శక్తిలేదు. బావిగట్టున కూర్చున్నాడు. దైవాన్ని ప్రేమిస్తూ, ప్రేమిస్తూ స్మరించాడు. కొంతసేపు స్మరించేటప్పటికి నీరు తన కాళ్ళక్రిందకు వచ్చింది. ఏమిటి చల్లగా ఉందని చూస్తే బావిలో అడుగున ఉన్న నీరు పొంగి పైకి వచ్చాయి. జ్ఞానము అనేది తన ఆకారమును మార్చుకోవలసి వచ్చింది. భక్తి దేనినీ మార్చనక్కరలేదు. ప్రేమను పెంచుకుంటే చాలు. సర్వము తన దగ్గరకే వస్తుంది. భక్తికి మించినది మరొకటిలేదు. భక్తిదేవుడు, జ్ఞానదేవునికి ఒక జాబు వ్రాసాడు. ఏమనీ? ఏమివ్రాసాడో తెల్లటి కాగితము చుట్టి కవరులో పెట్టి పంపించాడు జ్ఞానదేవునకు. జ్ఞానదేవుడు చూచాడు. ఏమీ కనపడలేదు. అక్షరాలుంటే మొదటినుండి చివరవరకు మనం చూడవచ్చును. 'ప్రియమైన సోదరా! ఇట్లు తమ్ముడు', అని చూడవచ్చు. అలాంటిది ఆ ఉత్తరంలో అక్షరాలే లేవు. అప్పటినుంచి జ్ఞానదేవుడు వ్రాస్తూ వ్రాస్తూ ఉంటున్నాడు జవాబు. ఎన్ని వ్రాసినా ఆ జాబులో ఏమైనా మిగిలినాయో ఏమో అందువల్లనే నిరంతరము వ్రాస్తూ వ్రాస్తూ ఉండిపోయాడు. అదే అద్వైతము. ఎప్పుడు చూచినా పరిశోధన, పరిశోధన. జీవితమంతా పరిశోధనతోనే

sri sathyasai vahini

పోయింది. ఎల్లకాలము పరిశోధనే అయితే పరిశీలన ఎప్పుడు జరిగేది? ఈనాటి సైంటిస్టులు ఈ గతే పడుతున్నారు. ఎప్పుడు చూచినా పరిశోధన. అనుభవము లేదు. నిన్నటిది యీనాడు కొత్తగా కనిపిస్తుంది. ఈనాటిది రేపటికి కొత్తగా కనిపిస్తుంది. మరునాటికి పాతగా మారిపోతుంది. యిదంతా కొత్త, పాత. దీనివల్ల మనకు ప్రయోజనములేదు. జ్ఞానముకంటే భక్తి చాలా సులభమైన మార్గము. జ్ఞానము చాలా కష్టమైనది. యిది అందరికి ప్రాప్తించేదికాదు. భక్తుడు భగవన్నామస్మరణచేత, ఆ ప్రేమావేశముచేత, ప్రేమయొక్క భావముచేత సర్వము తన వశము చేసుకోగలడు.

**మనోవాక్కాయములతో బుద్ధిపూర్వకంగా దైవత్వమును భావించినప్పుడు అంతకంటె ఆనందము మరొకటిలేదు**

విద్యార్థులారా! మీయందున్న ప్రేమను పెడమార్గము పట్టించుకోకుండా దానిని అసత్యమైన మార్గములో ప్రవేశపెట్టక, సమాజమునకు విరుద్ధమైన మార్గములో ప్రవేశపెట్టకుండా, తల్లిదండ్రుల అభీష్టమునకు విరుద్ధముగా ప్రవేశపెట్టక, సర్వసమాజమునకు 'సై' అనిపించే మార్గములో ప్రవేశపెట్టాలి. అయితే భగవద్విషయములో ఎవరి ఆజ్ఞ మనకు అక్కరలేదు. ఒకానొక సమయంలో మీరా నిరంతరము 'గిరిధర గోపాలా గిరిధర గోపాలా' అని పాడుతున్నాది. మహారాణాకు కోపం వచ్చింది. అతని అభీష్టమునకు ఈమె లొంగలేదు. ఎప్పుడు చూచినా సర్వకాల సర్వావస్థలందు కృష్ణనామమే చింతిస్తున్నాది. ఆ కోపము భరించుకోలేక కొప్పుపట్టి బయటకు యీడ్చివేశాడు, మందిరమునుండి. తక్షణమే కొంచెం shock వచ్చింది, పాపం మీరాకు. 'కృష్ణా! నిన్ను వదలిపోవటమా? యిది ఎలా సాధ్యమవుతుంది? నేను ఉండలేను నిన్ను వదలి', అని బాధ పడింది. భగవంతుడు సర్వత్రా ఉండేవాడు. 'కృష్ణా! మేరా దిల్ తుమారా మందిర్'. ఈ మందిరముకాదు. ఈ మందిరము మహారాణా కట్టాడు. నా హృదయమనే మందిరము నీవే కట్టించావు. నీవు కట్టిన మందిరము శాశ్వతము. దానిని వదలటానికి వీలులేదు. నా మందిరము అదే! 'చల్‌రే మన్ చల్‌రే మన్ గంగాయమునా తీర్' అని మనస్సుకు బోధించింది. ప్రయాగకు టిక్కట్టు రిజర్వు చేయించుకోవద్దు. ఉఛ్వాసనిశ్వాసములు

sri sathyasai vachanamrutam

ఒకముక్కుతో తీసుకోటం ఒక ముక్కుతో వదలటం యిదే 'యిడ', 'పింగళ' అన్నారు. ఈ యిడ, పింగళ భ్రూమధ్య స్థానములో కుంభకము అన్నారు. అదే ప్రయాగ. మూడింటి ఏకత్వమే ప్రయాగ. గంగ-భక్తి, యమున-కర్మ, అంతర్వాహినియై సరస్వతి-భ్రూమధ్యస్థానము. గంగా యమునా సరస్వతి మూడింటి సంగమ స్థానము, భ్రూమధ్యస్థానము. యిక్కడున్నావు నీవు. 'గంగాయమునా నిర్మల్‌పానీ'. యివి రెండు నిర్మలమైన జలముగా ఉంటున్నాయి. అంతేగాదు 'శీతలహోవె శరీర్ మోరమకుట పీతాంబర శరీర్ కుండలరజిత శరీర్ చల్‌రే'.' అక్కడకు వెళ్లు నీవు మరొక చోటుకు వెళ్లవద్దు' అని మనస్సుకు బోధించింది. అదికూడ ఎక్కడుంది? నీలోనే ఉంది. బయట ప్రపంచముకాదు, బయట ప్రదేశముకాదు, దైవము నీతోనే నీ హృదయమునందే నిండి ఉంటున్నాడు. అయితే అతన్ని ప్రత్యక్షంగా దేహరీతిగా అనుభవించినప్పుడు దానియొక్క ఆనందము నీకు లభ్యమవుతుంది. పుస్తకంలో వ్రాస్తుంటారు మైసూర్‌పాక్, జిలేబి, బర్ఫీ అని. చదివినప్పుడు అంత రుచి నీకు కనిపించదు. కానీ అదే మైసూర్‌పాక్, గులాబ్‌జాం, బర్ఫీ నోట్లో వేసుకుంటే రుచిగా కనిపిస్తుంది. భగవంతుడు నాయందే ఉన్నాడని జ్ఞానభావంతో పోతే భగవత్తత్త్వముయొక్క మాధుర్యము తెలీదు. ఆ భావస్వరూపుడైన భగవంతుని ఆనందమును అనుభవించినప్పుడు మాధుర్యము కనిపిస్తుంది. కనుక అవతారములు దిగిరావటానికి యివే కారణాలు. శారీరకంగా మానసికంగా బుద్ధిపూర్వకంగా అన్నింటియందు దైవత్వము మనం భావించినప్పుడు యింతకంటే ఆనందము మరొకటిలేదు. దీనినే గోపికలు ఆనాడు ఆశిస్తూ వచ్చారు. 'కృష్ణా! నీవు ఎక్కడెక్కడ పుడుతుంటావో అక్కడక్కడ మేముకూడా పుట్టాలి', అని తపన చెందారు.

**పుష్పంబువై నీవు పొలుపొందుచుండిన**
**తుమ్మెదనై నేను తిరుగుచుందు**
**వృక్షంబువై నీవు వర్ధిల్లుచుండిన**
**వల్లికనై నేను అల్లుకొందు**

నీవు పుష్పముగా ఉంటే నేను తుమ్మెదగా ఉండాలి. నీలో చేరేంతవరకు 'గీ' అని తిరుగుతూ

చాలా రోదనచేస్తూ తప్పక నీలో ప్రవేశించాలి. ప్రవేశించి ఆ మత్తును నేను త్రాగుతూ తన్మయత్వములో మునిగిపోతాను. నీవు వృక్షమువైతే నేను వల్లిక అయిపోవాలి. ఎట్లా? నీకు చుట్టుకొనే పోవాలికాని నీకు దూరం పోకూడదు.

**వరసముద్రుడే నీవైన వాహినినగుచు**
**నేను నీలోన ఐక్యమగుదు**

నీవు సముద్రుడై పుట్టినప్పుడు నేను నదిగా వచ్చి ఐక్యమైపోవాలి.

**మేరుపర్వతమె నీవైన పరచుకొని పారెద**
**నేను సెలయేరునై**
**అనంత ఆకాశమే నీవైన చిన్నచుక్కనై**
**నీలోన చెలగుచుందు**

నీవు పెద్ద ఆకాశము అయితే నేను చిన్న చుక్కగా నీలో వచ్చి ఉంటాను. కనుక నీకు, మాకు ఏమాత్రము ఎడబాటు జరగకూడదు. వియోగము జరగకూడదు. నిరంతరము సంయోగమే మాకు ప్రాప్తించాలి. ఆ సంయోగమే సరైన భక్తి తత్త్వమన్నారు. సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యము. యిదే ముఖ్యమార్గము. సాలోక్యము నీ చింతనలో ఉండాలి. సామీప్యము నీకు దగ్గరగా ఉండాలి. సారూప్యము, నీ రూపము నేను పొందాలి. సాయుజ్యము నీలో నేను ఐక్యమై పోవాలి. ఇదియే పంచమ పురుషార్థమన్నారు. పురుషార్థములు నాలుగుంటున్నాయి. ధర్మఅర్థకామమోక్షములని. కానీ ఈ పవిత్రమైన చేరిక అనేది ఐదవ పురుషతత్త్వము. ఇదియే పరమభక్తి అన్నారు. పరమ భక్తికి మించినది జగత్తులో మరొకటిలేదు. ఎన్ని వర్ణించినా దీనికి మించినది మరొకటిలేదు.

**భగవంతుని మరచిపోతే హీరోకూడా జీరో అయిపోతాడు**

విద్యార్థులారా! విద్యలనభ్యసించండి. ఉద్యోగాలు చేసుకోండి. వివాహము చేసుకోండి. డజన్లమంది పిల్లలను కనండి. తప్పేమిలేదు. కానీ దైవాన్ని మాత్రం మరవకండి. దైవాన్ని మర్చిపోతే జీవితము జీవితమేకాదు, ఎంత గొప్పవాడైనా సరే! ప్రైమినిస్టరు కావచ్చు, ప్రెసిడెంటు



sri sathyasaivachanamrutam

కావచ్చు. కానీ Hero becomes zero if he forgets GOD. ఇవన్నీ అప్పటికప్పుడు ఉండి పారిపోతుంటాయి; కానీ నీవు ఆ పరమతత్త్వమును మాత్రం వదలకూడదు. అవకాశము చిక్కితే దైవమునకు అత్యంత సమీపానికి పోవటానికి ప్రయత్నించాలి. ఇదే మానవుని ప్రధానమైన సాధన. అప్పుడే మానవత్వము సార్థకమవుతుంది. 'జంతూనాం నరజన్మ దుర్లభమ్' తినటం, తాగటం, నిద్రించటము యింత మాత్రముతోనేనా మానవత్వము? ఇవన్నీ పశుపక్షి మృగాదులుకూడా చేస్తున్నాయి. దానికి, మనకి ఉన్న వ్యత్యాసము ఏమిటి? మానవునిలో ప్రత్యేకత ఏమిటి? ఏ పవిత్రత ఉంటున్నాది? అంతా ఒక్కటే! What is the purpose of life అని question వేసుకుంటే ఖానా, పీనా, సోనా, మర్నా యిదేనా? ఈ నాలుగు పనులు అన్నింటికి జరుగుతున్నాయి. చీమలకు, పాములకు, దోమలకు వస్తున్నాయి. నీవూ అదే గతి పట్టిపోతే నీ మంచితనము ఏమిటున్నాది? మానవత్వములోని విలువ ఏమిటి? అన్నింటికంటె ఉన్నతస్థాయికి పోవాలి. అదే 'ఊర్ధ్వమూలం అధఃశాఖ' అని చెప్పింది వేదము. భగవత్ప్రేమకు సమీపానికి రావాలి. భగవదనుగ్రహమునకు పాత్రులు కావాలి. భగవదానందమును అనుభవించాలి. ఈ ఆనందమునకు మించినది మరొకటిలేదు.

**సాధ్యమైనంతవరకు వైరాగ్యమును సాధించాలి**

**ప్రేమరహిత మరుభూములలో**
**ప్రేమాంకురములు పెంపొంద**
**ప్రేమావేశముతో ప్రేమసుధావర్షము**
**వర్షింపగ ప్రేమనదులు ప్రవహింపగ**
**మురళిగానము సేయగదే కృష్ణా గానము సేయగదే**

ఏవో చెట్లునాటటంకాదు. ముండ్లచెట్లో, తుమ్మచెట్లో నాటకూడదు. ప్రేమచెట్టే నాటాలి అక్కడ. ప్రేమబిందువులు రావాలి. గానము ఎట్లా చేస్తున్నావు? మురళిగానము. ఆ మురళి ఏమిటి? తొమ్మిది తొట్లుండే మురళి. దేహమునకు తొమ్మిది తొట్లులున్నాయి. దేహమునే నీవు మురళిగా తీసుకో. అయితే ఈ దేహమనే మురళి కోరికలు అనే పదార్థములచేత నిండుకుపోయింది. కనుకనే స్వరాలు రావటంలేదు. దాన్నంతా hollow చేసినప్పుడు, భ్రాంతులు విసర్జించినప్పుడు

sri sathyasai vachanamrutam

hollow గా తయారౌతుంది. అది ఎప్పుడు hollow అయిపోయిందో అప్పుడు కృష్ణుడు hello అని పిలుస్తాడు. అప్పుడు దాన్ని తీసుకొని వాయిస్తాడు. ప్రతి తొఱ్ఱపైన తన వేళ్లు స్పర్శిస్తాయి. తన పెదవులపై ఉంటుంది మురళి. భగవంతుని ఉచ్ఛ్వాస నిశ్వాసములు ఆ ఫ్లూటుద్వారా పోయి అనేకమందికి ఆ శబ్దమును వినిపించి ఆనందములో ముంచివేస్తుంది. భగవంతునికి కావలసిన రెండు పదార్థములుగా మనం తయారుకావాలి. ఒక్కటి పాదరక్షలు, రెండవది మురళి. యిందులో ఏది నాకు కావాలి? పాదరక్షలంటే దానిపై నీ బరువంతా మోసుకోవాలి. కిందనున్న రాళ్లకు, ముండ్లకు చెత్తకు పాదములు అన్నింటిని భరించుకోవాలి అది. సర్వబాధలు భరించుకోవలసింది పాదరక్షలు. ఇది మహాకష్టము. ఏ విధంగా ఉంటుందో ఏమిటో! కానీ, మురళిగా తయారుకావటం చాలా సులభం. ఈ టవలు యిలా పట్టుకొని ఉండాలంటే చేయినొప్పి అవుతుంది. కాబట్టి టవలు గట్టిగా పట్టుకోటం గొప్పతనముకాదు. వదలటం చాలా సులభం. కనుక మనం కోరికలను గట్టిగా పట్టుకొని అవస్థలు పడటంకాదు, గొప్పతనము. వదలటమే చాలా సులభమైనది. అదే వైరాగ్యము. ఆ వైరాగ్యమును మనం సాధ్యమైనంతవరకు సాధించాలి. అయితే ఈ ప్రపంచములో ఉండినప్పుడు ఆ వైరాగ్యము సాధించటం అంత సులభంకాదు. నా కుమారుడు, నా బిడ్డ, నా భార్య, నా తల్లి ఏమిటి యీ 'నా, నా'? ఈ పదములలోనే కనిపిస్తున్నాది అది నీదికాదని. నా కుమారుడు, నా వాడా? కుమారుడు నాదికాదు. నా తల్లి, తల్లినాదికాదు. యి 'నా'కు అర్థము తెలుసుకుంటే ఎంతైనా అర్థమవుతుంది. 'నా'కు అర్థము తెలుసుకోవాలి. 'నా' కాదు. నా యిల్లు, యిల్లు నాదికాదు. కనుక, మొట్టమొదట 'నాది, నాది' అనే భావన విడిచిపెట్టాలి. దీనినే వేదాంతమునందు 'నేతినేతి' అని చెప్పబడింది. నేతి అనగా వెన్న కరిగించిన నేయికాదు. 'నేతి' అనగా 'న+ఇతి'. ఇదంతా కేవలం దైవస్వరూపమే అనే విశ్వాసము పెట్టుకోండి.

**(తేదీ 21-08-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini